# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 24-01-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ పరిసరాల పరిశుభ్రత జీవన విధానం కావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- ❖ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసిందని కేంద్ర సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ తెలిపారు.
- ❖ రాష్ట్రంలో కొత్తగా 13 డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు.
- ❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 130వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.

==================

పరిసరాల పరిశుభ్రత అనేది అందరి జీవన విధానం కావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా నగరిలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆయన ఈ రోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... ప్రతీ నెలా మూడవ శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం చేపడుతున్నామని చెప్పారు. పీల్చేగాలి, తినే ఆహారం, తాగే నీరు కాలుష్య రహితంగా ఉండాలని సూచించారు. 573 కోట్ల రూపాయలతో స్వచ్ఛాంధ్ర కోసం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు చేశామని వెల్లడించారు. అదే విధంగా 110 ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ యూనిట్ల ఏర్పాటుకు 510 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామని చంద్రబాబు నాయుడు పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

==================

ఉద్యోగాల భర్తీ ప్రక్రియను గడచిన దశాబ్ద కాలంలో ప్రభుత్వం వేగవంతం చేసిందని కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు. సీఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విశాఖ సాగర్‌మాల కన్వెన్షన్ సెంటర్‌లో ఈ రోజు జరిగిన `రోజ్ గార్ మేళా` కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో ఉద్యోగాలు సాధించిన 392 మంది అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కేంద్రప్రభుత్వం ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 17 రోజ్‌గార్ మేళాలను నిర్వహించి సుమారు 11 లక్షల మందికి నియామక పత్రాలని అందచేసిందని వివరించారు.

(వాయిస్ 30 సెకన్లు)

===================

రాష్ట్రంలో కొత్తగా 13 డయాలసిస్ కేంద్రాలను ఆసుపత్రులలో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. మంగళగిరిలోని ఎయిమ్స్ 8వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఈరోజు జరిగిన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాలలో కిడ్నీ రోగుల కష్టాలు తొలగించేందుకు ఈ డయాలసిస్ కేంద్రాలు దోహదపడతాయన్నారు. ఇందులో రెండు కేంద్రాలు గిరిజన ప్రాంత ఆసుపత్రులలో ఉన్నాయని, అక్కడ త్వరలో సేవలు ప్రారంభమవుతాయని చెప్పారు. మిగిలిన కేంద్రాలు ఏప్రిల్ నాటికి సిద్ధం అవుతున్నాయన్నారు. ఒక్కొక్క కేంద్రంలో 85 లక్షల రూపాయలతో యంత్రాలు, పరికరాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. 13 కేంద్రాల ఏర్పాటుకు 11.05 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నట్లుగా మంత్రి వివరించారు.

===================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 130వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. “మన్ కీ బాత్” తెలుగు అనువాదం ప్రధానమంత్రి ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, తిరిగి రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ఆకాశవాణి, దూరదర్శన్ కేంద్రాల ద్వారా ప్రసారం కానుంది.

===================

మహిళల రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసిందని హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. అనకాపల్లి జిల్లా కశింకోట మండలం తేగాడ మోడల్ పాఠశాలలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ తో కలిసి మంత్రి ఈ రోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... బాలికలు ధైర్యంగా ఉండాలని కోరారు. కొంతమంది పిల్లలు సామాజిక మధ్యమాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని పేర్కొంటూ.. చిన్న పొరపాట్లు వలన జీవితాలను నాశనం చేసుకోకూడదని హితవుపలికారు. అదే విధంగా పరిసరాల పరిశుభ్రతపైన ప్రతి విద్యార్థికి అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు.

విరామం

===================

వెనకబడిన తరగతుల ప్రజల రక్షణ కోసం త్వరలో చట్టాన్ని తీసుకునివస్తున్నామని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు. విజయవాడ గొల్లపూడి బీసీ భవన్ లో బీసీ సంఘాల ప్రతినిధులతో మంత్రి ఈ రోజు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఏప్రిల్ 11న పూలే 200వ జయంతి సందర్భంగా అమరావతిలో మహాత్మా జ్యోతిరావు పూలే స్మృతి వనానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. అలాగే.. అమరావతిలో 5 ఎకరాల్లో బీసీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేస్తామని, 28 జిల్లా కేంద్రాల్లో నూతనంగా బీసీ భవనాల నిర్మాణం చేపడతామని మంత్రి వివరించారు.

==================

రోడ్డు ప్రమాదాల నివారణ కోసం యువతకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కోరారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు - 2026 సందర్భంగా భీమవరం పాత బస్టాండ్ నుండి జిల్లా రవాణా, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో వివిధ కళాశాలల వాహనాల డ్రైవర్లు, ప్రజలతో నిర్వహించిన వాక్ థాన్ ర్యాలీని కలెక్టర్ ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రతి ఒక్కరు రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు.

==================

విశాఖ నగరంలో విశాఖ ఉత్సవాలు మరికొద్ది సేపటిలో ప్రారంభం కానున్నాయి. ఈ ఉత్సవాలను జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి, రాష్ట్ర పర్యాటక , సాంస్కృతిక శాఖ మంత్రి కందులు దుర్గేష్ విశాఖ సాగర తీరంలోని ప్రధాన వేదిక వద్ద ఈ ఉత్సవాలను ప్రారంభించనున్నారు. ఫిబ్రవరి 1 వరకు 9 రోజుల పాటు ఈ ఉత్సవాలు జరుగుతాయి. అదే విధంగా 20 ప్రధాన కేంద్రాలలో 500 పైగా సాంస్కృతిక పర్యాటక కార్యక్రమాలను నిర్వహిస్తారని అధికార వర్గాలు తెలిపాయి.

==================

టిడ్కో గృహాల పనులను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో జరుగుతున్న టిడ్కో ఇళ్ళ పనులతో పాటు.. ప్రభుత్వ ఆసుపత్రి, ఎన్.టి.ఆర్. కళాక్షేత్రం పనులను మంత్రి ఈ రోజు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... 2014లో తమ ప్రభుత్వం చేపట్టిన టిడ్కో పనులను గత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు.

==================

అన్న క్యాంటీన్ల ద్వారా ప్రజలకు రుచికరమైన, నాణ్యమైన భోజనం అందించడంతో పాటు క్యాంటీన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయం సమీపంలో ఉన్న అన్న క్యాంటీన్‌ను ఆమె ఈరోజు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భోజనాన్ని స్వయంగా రుచి చూసిన కలెక్టర్.. ప్రతి ఒక్కరికీ తగినంత భోజనం అందేలా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు.

==================

ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని పార్వతీపురం మన్యం జిల్లా సంయుక్త కలెక్టర్ సి. యశ్వంత్ కుమార్ రెడ్డి కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈరోజు కలెక్టరేట్ ఆవరణలో జిల్లా రెవెన్యూ అధికారి కె. హేమలత ఆధ్వర్యంలో జీరో గ్యాప్ శానిటేషన్ థీమ్ తో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

==================

బాపట్ల జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో బాపట్లలో "డ్రగ్స్ వద్దు బ్రో" అవగాహన కార్యక్రమాన్ని ఈ రోజు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఈగల్ విభాగం అధిపతి, ఐజి కే.రవికృష్ణ, బాపట్ల శాసనసభ్యుడు నరేంద్ర వర్మ, ఎస్పీ ఉమా మహేశ్వర్, ఈగల్ ఎస్పీ మహేశ్వర రాజు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టణంలోని స్థానిక అంబేద్కర్ సెంటర్ నుంచి విద్యార్థులతో వాక్‌థాన్ నిర్వహించారు.

==================
==================